సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం | 17 | మార్చి | 2024

ఇఫ్తార్ 6-34
(ఆదివారం సాయంత్రం)

సహర్ 5-03
(సోమవారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు



ఎంపీఓపై ఎంపీపీ దాడి

తన మాట వినడం లేదని కోడేరు ఎంపీపీ ఏకంగా ఎంపీఓను చెప్పుతో కొట్టారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /20.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

నాది మోదీ గ్యారంటీ..



అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ



సభావేదికపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ రాములు, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ ఎంపీ అభ్యర్థులు డీకే అరుణ, పి.భరత్‌ప్రసాద్, శానంపూడి సైదిరెడ్డి, నాయకులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, తల్లోజ ఆచారి, బంగారు శ్రుతి, ఎల్లేని సుధాకర్‌రావు తదితరులు

తెలంగాణ ప్రజల నిర్ణయం ఖాయమైంది

- రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఇస్తారన్న నమ్మకం ఉంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది అన్నదమ్ముల బంధం
- బీజేపీ అభ్యర్థులను గెలిపించి మీ ఆశీర్వాదం తెలపండి
- నాగర్‌కర్నూల్ 'విజయ సంకల్ప సభ'లో ప్రధాని నరేంద్రమోదీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: 'నేను హామీ ఇస్తే అది నెరవేరి తీరుతుంది. తెలంగాణలో అభివృద్ధికి, మార్పునకు మోదీది గ్యారంటీ. పగలు, రాత్రిని ఏకం చేసి మీ కోసమే పనిచేస్తున్నా. మీ ఆశయాలు, ఆశలు, ఆకాంక్షలు నాకు త్వరగా చేరాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించి మీ ఆశీర్వాదం తెలపండి..' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో బీజేపీ నిర్వహించిన 'విజయ సంకల్ప సభ'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కమలం పార్టీకి స్పష్టమైన మెజార్టీతో ఆశీర్వదించిన తర్వాతే దేశంలో మార్పు మొదలైందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదాన్ని తాను ఒక్కరోజు కూడా కుర్చీ కోసమో.. తన కోసమే ఉపయోగించుకోకుండా 140 కోట్ల కుటుంబం కోసమే పనిచేస్తున్నానని చెప్పారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి డబుల్ డిజిట్ ఇస్తారన్న నమ్మకం కలుగుతోందని అభిప్రాయపడ్డారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

పేదలు, మహిళలకే ప్రభుత్వ ఫలాలు..

కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టాక గడిచిన పదేళ్లలో పేదలు, మహిళలు, రైతులకే అధిక శాతం లబ్ధి చేకూరుతోందని ప్రధాని పేర్కొన్నారు. పేద మహిళలకు బ్యాంకు ఖాతాలు, ఆరోగ్య బీమా, చిన్న వ్యాపారులకు ముద్ర రుణాలు, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఉచిత వైద్యం, ప్రతి ఇంటికీ టాయిలెట్ సౌకర్యం కల్పించామని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పథకాలతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు, మహిళలే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో 2జీ కుంభకోణం, బీఆర్ఎస్ హయాంలో నీళ్ల పేరుతో దోపిడీకి పాల్పడ్డాయని దుయ్యబట్టారు. ఈ రెండు కుటుంబ పార్టీలది అన్నదమ్ముల బంధమని వ్యాఖ్యానించారు. అవినీతిపరులైన వారెవరినీ తమ ప్రభుత్వం వదిలిపెట్టదని హెచ్చరించారు.

కమలదళంలో నూతనోత్సాహం..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ ఎన్నికల ప్రచారానికి సాక్షాత్తు ప్రధానమంత్రి మోదీ హాజరై ప్రసంగించడంతో బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. బహిరంగసభకు పెద్దఎత్తున జనం హాజరుకావడం, ప్రధాని ప్రశంసలు దక్కడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. బీజేపీ విజయ సంకల్ప సభలో ఎంపీ రాములు, నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, పార్టీ ముఖ్య నేతలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, తల్లోజు ఆచారి, బంగారు శ్రుతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, దిలీపాచారి, జక్కా రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులందరికీ నమస్కారం

విజయ సంకల్పసభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుమారు 43 నిమిషాల పాటు ప్రసంగించారు. మొదటగా 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు..' అంటూ తెలుగులో తన ప్రసంగం ప్రారంభించారు. సభకు వచ్చిన జన సమూహాన్ని చూస్తుంటే బీజేపీని గెలిపించాలన్న ప్రజల నిర్ణయం తమకు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. దక్షిణ భారతదేశానికి ముఖద్వారమైన తెలంగాణ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, రాష్ట్ర వికాసం కోసం నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ప్రధాని మోదీని మంగళ వాయిద్యాల నడుమ బీజేపీ నేతలు వేదికపైకి ఆహ్వానించారు. వేదికపైకి వస్తున్న క్రమంలో ఓ చిన్నారిని చూస్తూ ప్రధాని అభివాదం చేశారు. మోదీ ప్రసంగం ప్రారంభించినప్పుడు, మాట్లాడుతున్నంత సేపు జనం 'మోదీ.. మోదీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. దేశంలో మూడోసారి తమ సర్కారు రావాలంటూ పలుమార్లు నినాదాలు చేయిస్తూ ప్రధాని సభికులను ఉత్సాహపరిచారు.

ప్రధాని మోదీ సభ సైడ్‌లైట్స్

- 11.42 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు
- 11.56 గంటలకు హెలీప్యాడ్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో సభాస్థలికి వచ్చారు.
- 12.11 గంటలకు బీజేపీ కార్యకర్తలకు, నాయకులనుద్దేశించి మోదీ ప్రసంగం ప్రారంభించారు
- 12.52 గంటలకు ప్రసంగం ముగించుకుని సభావేదికపై ఉన్న నాయకులతో కరచాలనం చేసి హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు
- 1.09 గంటలకు హెలీకాప్టర్‌లో కర్ణాటకకు వెళ్లారు.



బహిరంగ సభలో చిన్నారి ఉత్సాహం

- విజయ సంకల్పసభకు నాగర్‌కర్నూల్‌తో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ నియోజకవర్గాల నుంచి వేలాది మంది తరలివచ్చారు.
- వేదికపై ఉన్న నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి, నాగర్‌కర్నూల్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణను కార్యకర్తలకు పరిచయం చేశారు
- ప్రధాని మోదీ తన ప్రసంగం తెలుగులో ప్రారంభించడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు
- సభావేదిక వద్ద, సభా ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీజీ సిబ్బంది బందోబస్తు కల్పించారు.
- సభలో యువత చప్పట్లు కొడుతూ, విజిల్స్ వేస్తూ సందడి చేశారు.



నాగర్‌కర్నూల్‌లో విజయ సంకల్ప బహిరంగ సభకు హాజరైన బీజేపీ శ్రేణులు

గజదొంగలు వచ్చారు కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి



తెలంగాణను దోచుకున్న దొంగలు పోయి.. ఇప్పుడు గజ దొంగలు అధికారంలోకి వచ్చారని, రాష్ట్రం పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టుగా ఉందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మద్యం, భూములు, ఇసుక, మైనింగ్ దందాలు సరిపోక కేసీఆర్ కుటుంబం ఢిల్లీ వెళ్లి బీరు, బ్రాండీ వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో గారడీ చేస్తోందని విమర్శించారు. దేశంలో నీతివంతమైన, సుస్థిరమైన పాలనను కొనసాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని మూడోసారి గెలిపించాలని కోరారు.

ప్రతి నోటా మోదీ మాటే డీకే అరుణ



దేశంలో ఎక్కడ చూసినా ప్రతి ఒక్కరి నోటి వెంట మోదీ మాటే వినిపిస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. రాష్ట్రంలో ప్రజల తరపున బీజేపీ పోరాటం చేస్తే అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. కరోనా కాలంలో ఇంటింటికి వ్యాక్సిన్ అందించి ప్రధాని మోదీ ప్రజలకు అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పాలనలో 60 ఏళ్లలో చేయనివి బీజేపీ పదేళ్లలోనే చేసి చూపించిందన్నారు. ప్రధాని మోదీ భారత్ కీర్తిని పెంచుతుంటే కాంగ్రెస్ మాత్రం విషం చిమ్ముతోందని మండిపడ్డారు. వికసిత్ భారత్ సంకల్పంతో ప్రపంచంలో భారత్‌ను అగ్రదేశంగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

మీ ప్రతి ఓటు మోదీకే భరత్ ప్రసాద్



ఈసారి కూడా కేంద్రంలో మోదీ సర్కారే అధికారంలోకి రానుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ అన్నారు. అయోధ్యలో రాముడి ఆలయం ప్రారంభంతో మోదీకి దేశ ప్రజల ఆశీస్సులు లభించాయన్నారు. యువతకు శిక్షణ, ఉపాధి, మహిళలకు ఉజ్వల, రైతులకు ఆర్థిక భరోసాతో కేంద్ర ప్రభుత్వం పేదల అభివృద్ధికి కృషిచేస్తోందని అన్నారు. బీజేపీ అభ్యర్థులకు వేసే ప్రతి ఓటు ప్రధాని మోదీకే వెళ్తోందని, ఆయన్ను మూడోసారి ప్రధానిగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

కోడ్.. కూసింది!

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌తో రాజకీయ సందడి

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్.. మే 13న పోలింగ్.. జూన్ 4న కౌంటింగ్
- గెలుపే లక్ష్యంగా వ్యూహాల అమలుకు పార్టీల సన్నద్ధం
- 2 స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థుల ఖరారు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఖరారు కాని నాగర్‌కర్నూల్ అభ్యర్థులు
- 'కారు' డీలా.. పార్టీ శ్రేణుల్లో అయోమయం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నగారా మోగింది. దేశవ్యాప్తంగా అన్ని పార్లమెంట్ స్థానాల ఎన్నికలకు సంబంధించి ఢిల్లీలో శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో రాజకీయ పక్షాలు గెలుపు వ్యూహాలతో సమరానికి సన్నద్ధమవుతున్నాయి. ఏప్రిల్ 18వ తేదీన అధికారికంగా ఎన్నికల గెజిట్ విడుదల కానుండగా.. మే 13న పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన శనివారం నుంచి పోలింగ్ నాటికి 58 రోజుల వ్యవధి రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు కీలకంగా మారనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల క్రమంలో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లు, సౌకర్యాల కల్పన తదితర ఏర్పాట్లపై అధికార యంత్రాంగం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రాగా.. ఇందుకనుగుణంగా తగిన చర్యలు చేపట్టింది. ఓటు హక్కు వినియోగంపై అవగాహనతోపాటు ఎన్నికల నిర్వహణకు సిబ్బంది, బందోబస్తు తదితర ఏర్పాట్లపై నిమగ్నమైంది.

మహబూబ్‌నగర్‌లో 16,80,417..
నాగర్‌కర్నూల్‌లో 17,34,773..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. జనరల్ స్థానమైన మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు (మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కొడంగల్, షాద్‌నగర్.. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంటు (నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, అలంపూర్) ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పక్షాలు ఓట్ల వేటకు సన్నద్ధమవుతున్నాయి. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో మొత్తం 16,80,417 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 8,32,080 కాగా.. మహిళా ఓటర్లు 8,48,293, ఇతరులు 44 మంది ఉన్నారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,34,773 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 8,64,034 కాగా.. మహిళా ఓటర్లు 8,70,694, ఇతరులు 45 మంది ఉన్నారు.

బీఆర్ఎస్ డీలా.. శ్రేణుల్లో ఆందోళన

నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో ఇప్పటివరకు బీజేపీ మినహా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు కాలేదు. కమలం నుంచి ఇక్కడ సిట్టింగ్ ఎంపీ పి.రాములు తనయుడు పి.భరత్ పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తులో భాగంగా బీఎస్పీకి ఈ నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానాన్ని కేటాయించినట్లు గులాబీ నేతలు ప్రకటించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుంచి పోటీ చేయనున్నట్లు ప్రచారం జరిగింది. శనివారం ఆయన అనూహ్యంగా బీఎస్పీకి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో ఆయన బీఆర్ఎస్ నుంచే పోటీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ కుదేలైనట్లు తెలుస్తోంది. అటు మహబూబ్‌నగర్, ఇటు నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్, బీజేపీకి చెందిన రేవంత్‌రెడ్డి, నరేంద్ర మోదీ వంటి పెద్దలు ప్రచార సభలతో దూసుకెళ్తుంటే ఈ రెండు స్థానాల్లోనూ బీఆర్ఎస్‌లో స్తబ్దత నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ డీలా పడగా.. పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

జూన్ 4 వరకు కోడ్..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల కావడంతో ఫిబ్రవరి 27 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఏప్రిల్ 4వ తేదీన ఎన్నికల ప్రక్రియ ముగియనుండగా.. అప్పటివరకు కోడ్ అమల్లో ఉండనుంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ షెడ్యుల్ విడుదలైన నేపథ్యంలో మళ్లీ కోడ్ కూసింది. ఈ లెక్కన పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసే నాటికి అంటే జూన్ నాలుగో తేదీ వరకు కోడ్ అమల్లో ఉండనుంది.

మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వివరాలు..

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	272	1,28,268	1,30,377	13	2,58,658
జడ్చర్ల	274	1,11,354	1,11,863	5	2,23,222
దేవరకద్ర	289	1,18,372	1,20,705	0	2,39,077
మక్తల్	284	1,19,474	1,23,863	1	2,43,338
నారాయణపేట	270	1,16,261	1,19,254	2	2,35,517
కొడంగల్	275	1,19,237	1,23,020	10	2,42,267
షాద్‌నగర్	252	1,19,114	1,19,211	13	2,38,338
నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వివరాలు..					
వనపర్తి	296	1,35,367	1,37,282	4	2,72,653
గద్వాల	303	1,25,356	1,30,499	11	2,55,866
అలంపూర్	290	1,17,997	1,21,074	8	2,39,079
నాగర్‌కర్నూల్	259	1,18,764	1,19,366	3	2,38,133
అచ్చంపేట	265	1,23,234	1,24,382	5	2,47,621
కల్వకుర్తి	262	1,22,805	1,20,148	9	2,42,962
కొల్లాపూర్	269	1,20,511	1,17,943	5	2,38,459

కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటాపోటీ..

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారయ్యారు. కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బరిలో ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం వీరి మధ్యే పోరు సాగింది. అప్పుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందగా.. అరుణ రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలు ఎవరి వైపు మొగ్గుచూపుతాయనే అంశం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేస్తూ ముమ్మరంగా ప్రచారం కొనసాగిస్తున్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షల నిర్వహణ



మోడల్ బేసిక్ పాఠశాలలో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన కేంద్రాలను డీఈఓ రవీందర్ పరిశీలించారు. ఈ మేరకు ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముందుగా ఆయన జిల్లాకేంద్రంలోని గాంధీరోడ్డు, మోడల్ బేసిక్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను, అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, వెలుతురు లేని గదుల్లో లైట్లు, తాగునీరు, బెంచీల వంటివి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మూల్యాంకనం జాగ్రత్తలు పాటించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పిదాలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ శ్రీధర్ సుమన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన క్యాంపులో ఆయన సిబ్బందికి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న పలు కళాశాలల్లో పనిచేస్తున్న ఎగ్జామినర్లు సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. బోర్డు ద్వారా ఎగ్జామినర్లకు నియామకమై.. రిలీవ్ చేయని కళాశాలలకు నోటీసులు జారీ చేసి, పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.

కురుమూర్తిస్వామి హుండీ లెక్కింపు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామికి అమవాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని భక్తులు సమర్పించిన కానుకల హుండీని ఆలయ సిబ్బంది శనివారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.4,83,085 వచ్చినట్లు ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

సర్టిఫికెట్ కోర్సులకు అవగాహన ఒప్పందం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌కేసీ సంస్థతో ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ ద్వారా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు టీఎస్‌కేసీ సంస్థ ద్వారా విద్యార్థులకు ఇంటి దగ్గరే ఉండి మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్ ట్యాలీ, ప్రైం పీకో అబాట్ సర్టిఫికెట్ కోర్సులు ఆన్‌లైన్ ద్వారా నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. సంస్థ సీఈఓ జాబ్ జోసెఫ్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఇంటెన్సీ ప్రోగ్రాం ద్వారా స్టైఫండ్ పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ ముంతాజ్ జహాన్ పాల్గొన్నారు.

'రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలుస్తారు'



కేసు రాజీపత్రాలు అందజేస్తున్న న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే ఇద్దరూ కక్షిదారులు గెలుస్తారని, పరిష్కారమైన కేసులకు హైకోర్టులో అప్పీల్ ఉండదని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. సమావేశంలో న్యాయమూర్తులు శ్రీదేవి, చంద్రకళ, వై.పద్మ, సంధ్యారాణి, శ్రీదేవి, చైతన్య, హరికుమార్, నిహారిక, భావన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

18,460 కేసులు రాజీ

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో ప్రత్యేకంగా ఏడు బెంచీలు, జడ్చర్ల కోర్టులో రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. ఇందులో ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం 18,460 కేసులు రాజీ చేశారు. వాటిలో ప్రీలిటిగేషన్ కేసులు 1,407 బెంచీపైకి రాగా.. ఇందులో 383 కేసులు రాజీ చేసి పరిష్కరించి వాటి ద్వారా రూ.25,13,000 నగదు నష్టపరిహారం అందించారు. దీంతోపాటు వినియోగదారుల ఫోరంలో ఒక కేసు రాజీ చేసి రూ.11 లక్షల నష్టపరిహారం బాధితులకు అందించారు. అలాగే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 18,076 కేసులు రాజీ కాగా ఆయా కేసుల్లో రూ.4,40,68,442 నష్టపరిహారం బాధితులకు అందించారు.

పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్లు, ఎస్పీలు అవసరమైన చర్యలు తీసుకోవాలి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో వీసీ నిర్వహించారు. శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని, తక్షణమే పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు తదితర ప్రచార సామగ్రి తొలగించాలన్నారు. జిల్లాస్థాయి ఫిర్యాదుల కమిటీని తక్షణమే పని ప్రారంభించేలా చూడాలన్నారు. నివేదికలు ఎప్పటికప్పుడు పంపాలని, ఎన్నికలకు సంబంధించి తప్పనిసరిగా రూపొందించే సామగ్రి, ఇతర సామగ్రిపై దృష్టిసారించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెట్టుకు ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

పెంట్లవెల్లి: మండలంలో సింగవరంలో చెంచు బక్కమ్మ(35) మామిడి తోటలో ఉరేసుకుని శనివారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు వివరాలు చెప్పగా, వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారించారు. కొండనాగుల గ్రామం నుంచి బతుదెరువు కోసం కొంతకాలం క్రితం సింగవరం వచ్చి కూలీ చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. కొంత కాలంగా అప్పులు ఎక్కువ కావడంతో భార్య, భర్త లింగస్వామి ఇద్దరు అప్పులు ఎలా కట్టాలని గొడవ పడడంతో ఆమె శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఉదయాన్నే ఆమె శవమై మామిడి తోటలో కనిపించిందని ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపారు. మృతిపై అనుమానం ఉన్నట్లుగా కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని, వివరాలు సేకరిస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు. మృతురాలికి కూతురు ఉంది.

కూతురు కాపురానికి పోలేదని తండ్రి..

నవాబుపేట: కూతురు కాపురానికి పోలేదని మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కూచూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హన్మంతు, జంగమ్మ కుమార్తె సోనిని రెండేళ్ల క్రితం పెద్దదరిపల్లికి చెందిన శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేశారు. కాగా ఆమె భర్తతో గొడవ పడి పుట్టింటికి వచ్చేసింది. దీంతో పలు మార్లు నచ్చజెప్పిన భర్తతో వెళ్లలేదు. కాగా తాజాగా బంధువులు, కుల పెద్దలు అందరూ కలిసి మరోసారి పంచాయతీ పెట్టి ఒప్పించారు. అయినా ఆమె వెళ్లలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన హన్మంతు (45) శుక్రవారం ఇంట్లో ఉన్న దోమల నివారణ మందును తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య జంగమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

ప్రేమ విఫలమైందని యువకుడు..

బల్మూర్: ప్రేమించిన యువతికి వేరొకరితో వివాహం చేయడానికి నిశ్చయించడంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన డ్యాగ హరికృష్ణ(27) ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంత కాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో యువతి కుటుంబసభ్యులు వారి పెళ్లికి నిరాకరించి మరో వ్యక్తితో పెళ్లి నిశ్చయించారు. మనస్తాపానికి గురైన యువకుడు ఈనెల 10న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నాలుగు రోజుల చికిత్స అనంతరం 15న అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లో తరలించారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనపై మృతుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటుల ఏఎస్‌ఐ రేణయ్య తెలిపారు. కాగా హరికృష్ణ గత ఎన్నికల వరకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు వద్ద పీఏగా పని చేశాడు. బాధిత కుటుంబసభ్యులను ఆస్పత్రి వద్ద మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. కుటుంబసభ్యులకు అండగా ఉంటానని తల్లిదండ్రులను భరోసా కల్పించి ఓదార్చారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ధరూరు: మతిస్థిమితం సరిగా లేని ఓ యువకుడు ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న ఘటన మండలంలోని కోతులగిద్దలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాముడు శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. కాలిన గాయాలతో గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. 30 శాతం చర్మం కాలిందని, చికిత్స కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. శనివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకట్రాములు తెలిపారు.

బావిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

అయిజ: సరదాగా స్నేహితులతో బావిలో ఈతకొట్టేందుకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని మూగోనిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మూగోనిపల్లికి చెందిన మిర్జాపురం కురువ ఆంజనేయులు, సరోజమ్మ దంపతుల కుమారుడు నరేష్ (10) మండలంలోని భూంపురం ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నం పాఠశాల వదిలిన అనంతరం తోటి స్నేహితులతో కలిసి మూగోనిపల్లి సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. సరదాగా ఈతకొడుతున్న సందర్భంగా నరేష్ బావి పైనుంచి నీటిలోకి దూకాడు. నీటిలోపల మట్టిలో పాతుకొని ఉన్న కర్ర ముక్క గొంతుకు కుచ్చుకోవడంతో రక్తం నీటిపైకి వచ్చింది. భయభ్రాంతులకు గురైన తోటి స్నేహితులు గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయం చెప్పారు. గ్రామస్తులు పరుగున వెళ్లి బాలుడిని నీటిలోనుంచి బయటకు తీశారు. అప్పటికే నరేష్ ప్రాణాలు కోల్పోయాడు. కురువ ఆంజనేయులుకి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కాగా నరేష్ ఆఖరి సంతానం. ఈ ఘటనతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఔట్‌సోర్సింగ్ పార్టీగా మారిన బీజేపీ

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ ఔట్‌సోర్సింగ్ పార్టీగా మారిందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత మొదటిసారి శనివారం మధ్యాహ్నం పద్మావతికాలనీలోని తన నివాసం నుంచి జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం వరకు పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు లేక బయట వారిని ఎంపిక చేస్తున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా తాను ఆ పార్టీ తరఫున ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన చోట అభ్యర్థులను గెలిపించానన్నారు. అలాంటిది తనకు కనీస గౌరవం ఇవ్వకుండా, పాలమూరు ఎంపీ టికెట్ ఎందుకు కేటాయించలేదో కారణం చెప్పకపోవడంతో బయటకు వచ్చేశానన్నారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఎలాంటి సిద్ధాంతాలు లేవని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తన ఇంటికి స్వయంగా ముఖ్యమంత్రి వచ్చి సాదరంగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడంతో చేరానన్నారు. దమ్మున్న బిడ్డ.. సీఎం రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. గతంలో రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన తనకు ప్రస్తుతం కేబినెట్ హోదాలో రాష్ట్ర క్రీడల సలహాదారుగా సముచిత స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్రాన్ని క్రీడల హబ్‌గా మార్చుతామని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయిస్తామన్నారు. అభివృద్ధికి దారి చూపించిందే కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేశారన్నారు. ఈసారి మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించే బాధ్యత తీసుకుంటున్నానన్నారు. అంతకుముందు పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో అపార అనుభవం కలిగిన ఏపీ జితేందర్‌రెడ్డికి సాదరంగా స్వాగతం పలుకుతున్నామన్నారు. కాంగ్రెస్‌కు పాలమూరు జిల్లా కంచుకోట అని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డికి సీఎం సముచిత స్థానం కల్పించారన్నారు. ఆయన కుమారుడు మిథున్‌కుమార్‌రెడ్డికి ఎంతో భవిష్యత్ ఉందని కాంగ్రెస్‌లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి అభ్యర్థి లేని సమయంలో తాను అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఎవరూ పిలిచి మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలో ఆ పార్టీ గ్రూపులుగా విడిపోయిందని విమర్శించారు. 'దేశం ..ధర్మం' పేరిట కార్యకర్తల జీవితాలతో బీజేపీ నేతలు ఆడుకుంటున్నారని ఆరోపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌సిద్దీఖ్, ఎన్‌పీ.వెంకటేశ్, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, లక్ష్మణ్ యాదవ్, ఫయాజ్, సాయిబాబ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నోటీసులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలు పాఠశాలల ఉపాధ్యాయులకు డీఈఓ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని లక్ష్మీపల్లి హైస్కూల్, వేముల, వెలుగొమ్ముల పాఠశాలల ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలలు తెరవడం లేదని 'సాక్షి'లో 'సమయపాలన ఏది', సకాలంలో హాజరు కాని ఉపాధ్యాయులు' కథనం శనివారం ప్రచురితమైంది. స్పందించిన డీఈఓ రవీందర్ ఉపాధ్యాయులు పాఠశాలకు ఆలస్యంగా రావడంపై విచారణ చేస్తామన్నారు. లక్ష్మీపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సల్వాచారికి నోటీసులు జారీ చేశామన్నారు. వీరితో పాటు వెలుగొమ్ముల, వేముల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈఓ ద్వారా నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇచ్చిన నోటీసులకు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. వారు ఇచ్చిన జవాబు ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎంపీఓపై ఎంపీపీ చెప్పుతో దాడి

కోడేరు: మండల పరిషత్ కార్యాలయంలో విధుల్లో ఉన్న ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌ను ఎంపీపీ కార్యాలయంలో తన చాంబర్‌లోకి పిలిపించుకొని తన మాట వినడం లేదంటూ ఆగ్రహం ఎంపీపీ చెప్పుతో కొట్టిన ఘటన ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం చోటు చేసుకుంది. ఎంపీఓ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. ఎత్తం ఎంపీటీసీ సాయిని శ్రీనివాస్‌రావుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నెల రోజుల క్రితం రూ.6లక్షలు వివిధ పనుల కోసం ఎంపీపీతో పాటు మరికొందరు ఎంపీటీసీల తీర్మానం మేరకు ప్రొసిడింగ్ కాపీ ఇచ్చారు. మరుసటి రోజు ఎత్తంకు ఇచ్చిన ప్రొసిడింగ్‌ను రద్దు చేయాలని ఎంపీపీ కొండా వెంకటరాధ ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌ను ఫోన్‌లో కోరారు. అందుకు అప్పటికే ఎత్తం ఎంపీటీసీ కాపీ ఇచ్చామని చెబుతూ వచ్చారు. శనివారం కార్యాలయానికి మధ్యాహ్నం వచ్చిన ఎంపీపీ ఎంపీఓ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందిని పిలిపించుకుంది. వచ్చిన వెంటనే ఎంపీఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడింది. అంతటితో ఆగకుండ నామాట వినడం లేదని చెప్పుతో రెండుసార్లు చెంపపై కొట్టి అక్కడే ఉన్న కుర్చీలను కింద పడేసింది. దీంతో షాక్‌కు గురైన ఎంపీఓతో పాటు అక్కడ ఉన్న సిబ్బంది ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా దుర్భషలాడుతుండగా ఈ విషయంపై ఎంపీఓ అదనపు కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించారు. వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎంపీపీపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

నా అనుమతి లేకుండా పనులు

ఎంపీఓ మూడు నెలల క్రితం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్నప్పుడు మండల పరిషత్‌కు మంజూరైన కొన్ని పనులకు నాకు తెలియకుండానే ఎంపీటీసీ సభ్యులకు ఇచ్చారని ఎంపీపీ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎత్తం, తుర్కదిన్నె గ్రామాల పనుల విషయం అడుగుతుండగా పెద్దగా గొంతు చేస్తే సరిపోదని ఏకవచనంతో అనడం వల్ల కోపం వచ్చిందన్నారు. ఎంపీపీ పనులు ఆపాలని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారని కావాలంటే ఫోన్ చేయాలని వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారని అన్నారు. మంత్రి జూపల్లికి ఫోన్ చేస్తే తనకు తెలియదని పనులు ఆపమని చెప్పలేదని ఇంకా పనులు ఎక్కువగా ఉంటే చేసుకోవాలని చెప్పానని అన్నారు. దీంతో కోపం వచ్చి కొట్టానని అన్నారు. ఎంపీఓపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

స్త్రీ సమానత్వంతోనే సమాజాభివృద్ధి



వీసీని సన్మానిస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్త్రీకి సమానత్వం వచ్చినప్పుడు పూర్తి స్థాయిలో సమాజాభివృద్ధి అవుతుందని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ పేర్కొన్నారు. పాలమూరు యూనివర్సిటీలో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్త్రీలు ఆర్థికంగా ఎదిగితే సమాజంలో కుటుంబాలు అభ్యున్నతి చెందుతాయన్నారు. శారీరకంగా, మనసికంగా ధృడంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని, అటువంటి వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. స్త్రీలలో దాగి ఉన్న ప్రతిభను గుర్తిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాధవి, ప్రవీణ, రాజ్‌కుమార్, చంద్రకిరణ్, కిశోర్, రవికుమార్, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ అద్భుతం

జడ్చర్ల టౌన్: తక్కువ ప్రదేశంలో ఎక్కువ మొక్కల జాతులుండటం విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడే బొటానికల్ గార్డెన్ అద్భుతమని పీయూ వీసీ లక్ష్మీరాథోడ్ అన్నారు. గార్డెన్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా శనివారం ఆయన గార్డెన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల సాంద్రత ఎక్కువగా ఉందని, పాలమూరు జిల్లాలో ఇలాంటి గార్డెన్ ఉండటం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. విద్యార్థుల్లో పరిశోధన శక్తి పెరగటానికి దోహదపడుతుందని, జీవవైవిధ్య కేంద్రంలో పరిశోధనల వల్ల ఉపయుక్తంగా ఉంటాయన్నారు. విశిష్ట అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మాధవి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ డిగ్రీ కళాశాల స్థాయిలో ఇంత అద్భుతమైన గార్డెన్ ఉండటం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్‌లో గార్డెన్ విద్యార్థుల పరిశోధనలు, విజ్ఞానాన్ని అందించే కేంద్రంగా మారుతుందన్నారు. వేడుకలకు వచ్చిన అతిథులకు ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పర్యావరణహిత బొకేలతో స్వాగతం పలికారు. గార్డెన్‌లోని వివిధ విభాగాలు తిలకించిన అనంతరం గార్డెన్‌లో సైకాస్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. వేడుకల్లో భాగంగా గార్డెన్‌లో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

నాన్‌టీచింగ్ సిబ్బందికి న్యాయం చేయండి

విద్యాశాఖ సెక్రటరీకి విన్నవించిన ఆర్.కృష్ణయ్య



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందికి న్యాయం చేయాలని కోరుతూ విద్యాశాఖ సెక్రటరీ బుర్రి వెంకటేషంకు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విన్నవించారు. 2015లో సిబ్బందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని అధికారులు ప్రభుత్వానికి విన్నించిన ప్రభుత్వం అంగీకరించలేదన్నారు. 2016లో వేతనాల పెంపుపై ఒక కమిటీ వేసి టీఎల్ఎస్ స్వామి ఆధ్వర్యంలో నివేదిక ఆధారంగా తక్కువ వేతనాలు ఉన్న సిబ్బందికి ప్రతి సంవత్సరం 12శాతం వేతనాలు పెంచే విధంగా అప్పటి నుంచి నాలుగేళ్ల పాటు వేతనాలను పీయూ అధికారులు పెంచారు. ప్రస్తుతం వీసీగా ఉన్న లక్ష్మీకాంత్‌రాథోడ్ 12శాతం వేతనాలను పెంపుదలను నిలిపివేశారన్నారు. వీరితో పాటు విధుల్లో చేరిన కాకతీయ యూనివర్సిటీలో సిబ్బందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా మర్చుతూ నిర్ణయం తీసుకున్నారని, పీయూ సిబ్బందిని కూడా కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చుతూ జీఓ 60ని అమలు చేయాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం



కాలిపోయిన వస్త్ర దుకాణం

మక్తల్: షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని అంకేన్‌పల్లికి చెందిన రాజు 8ఏళ్లుగా మెన్స్‌వేర్ షాపును పట్టణంలోని బస్టాండ్ వెనుక వైపు నడిపిస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం రాత్రి షాపును తాళం వేసి వెళ్లాడు. కాగా శనివారం తెల్లవారుజామున షాపులో నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి యజమానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వాహనం చేరుకుని మంటలను అర్పివేశారు. అంతలోపే దుస్తులు బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే కలెక్టర్ కోయహర్షకు సమాచారం ఇచ్చారు. బాధితులను ఆదుకోవాలని లేకపోతే కుటుంబం వీధిన పడుతుందని కలెక్టర్‌కు వివరించారు. వెంటనే కలెక్టర్ తహసీల్దార్ సువర్ణ రాజుకు ఆదేశాలు ఇవ్వడంతో ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

భార్య గొంతుకోసి భర్త ఆత్మహత్య



భారతి (ఫైల్)



శివశంకర్ (ఫైల్)

కోడేరు: భార్యను గొంతు కోసి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా.. తుర్కదిన్నెకు చెందిన గొల్లమంగుదొడ్డి శివశంకర్ (35) నాలుగేళ్ల క్రితం రాజాపూర్‌కు చెందిన భారతి(28)తో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య నర్మదను తుర్కదిన్నెలో ఉంచి చిన్న భార్య భారతితో హైదరాబాద్‌లోని వాటర్ ప్లాట్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల క్రితం భారతి రాజాపూర్‌లోని పుట్టింటికి వచ్చింది. ఈనెల 8న హైదరాబాద్ నుంచి శివశంకర్ తుర్కదిన్నెకు వచ్చాడు. చిన్నభార్య కాపురానికి రావాలని రోజు ఫోన్లో ఎంత అడిగినా రాకపోవడంతో శనివారం ఉదయం రాజాపూర్ వెళ్లాడు. భార్యాభర్తలను ఇంట్లో ఉంచి అత్తమామలు చిన్నమ్మ, బాలరాంతో పాటు మనవడు పవన్‌కుమార్‌ను తీసుకుని కోడేరుకు బంధువుల గ్రామ దేవత పండుగ చేస్తుండటంతో వెళ్లారు. ఇంట్లో ఉన్న భార్యభర్తలు ఇద్దరు గొడవ పడి భర్త శివశంకర్ భార్య భారతిని కత్తితో గొంతుపై కోయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇంతలోనే ఇల్లు మూసి తుర్కదిన్నె శివారులో తన వ్యవసాయ పొలంలో ఉన్న కోళ్ల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజాపూర్‌లో ఇల్లు ఎంతకు తెరకపోవడంతో అనుమానం వచ్చి చుట్టు పక్కల వారు తలుపులు తెరవడంతో అప్పటికే భారతి రక్తపుమడుగులో పడి ఉంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భర్త చంపాడని తుర్కదిన్నె గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో కొందరు గ్రామస్తులు కోళ్లషెడ్డు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే అతను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు ఘటనలను కొల్లాపూర్ సీఐ నరేష్, కోడేరు పోలీసులు పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. భారతి ఆరు నెలల గర్భిణీ అని తల్లి చిన్నమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది.

అంబగిరిలో దుప్పి మాంసం పట్టివేత

బల్మూర్: మండలంలోని అంబగిరిలో శనివారం అటవీశాఖ అధికారులు అడవి దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్ఓ వీరేషం తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మూడవత్ నర్సింహ, కెతావత్ సాయి ఉద్దేశపూర్వకంగా గ్రామ సమీపంలోని అడవి సరిహద్దు పొలాల్లో వేరుశనగ పంటకు విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. దానికి అడవి దుప్పి తగిలి చనిపోవడంతో మాంసం ముక్కలుగా చేశారు. సమాచారం అందడంతో సెక్షన్ ఆఫీసర్ నరేందర్, రవీందర్ సోదా చేయగా సుమారు 20 కేజీల వరకు దుప్పి మాంసం పట్టుబడినట్లు ఆయన తెలిపారు. దీంతో మాంసాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీల్లో రాణించాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రీడాకారులు జాతీయ యోగా పోటీల్లో రాణించాలని జిల్లా యోగా అసోసియేషన్ సభ్యులు అన్నారు. వెస్ట్‌బెంగాల్ రాష్ట్రం హోగ్లిలో ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే జాతీయస్థాయి యోగా పోటీల్లో బాలమణి (అండర్ 21–25), స్వప్న, మధు (అండర్ 18–21) పాల్గొంటున్నారు. వీరిని శనివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా యోగా అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సన్మానించి అభినందించారు. జాతీయస్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, సభ్యులు చంద్రశేఖర్, సూర్యప్రకాష్, కిషన్‌దాస్ పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వ ధ్వంసంపై ఫిర్యాదు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌తండా సమీపంలో ఎంజీకేఎల్ ప్యాకేజీ–28 కాల్వను ధ్వంసం చేసి పైపులు ఏర్పాటు చేసిన రైతులపై ఇరిగేషన్ అధికారులు తహసీల్దార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండుతున్న తరుణంలో కాల్వ ద్వారా సాగునీరు సరఫరా అవుతున్న తరుణంలో శాగాపూర్‌తండాకు చెందిన నిరంజన్‌నాయక్, సహదేవునాయక్, బిక్షపతినాయక్, నాగోషియాదవ్ దౌర్జన్యంగా సాగునీటి కాల్వను ధ్వంసం చేసి పైపులు వేసుకున్నారు. కాల్వ ద్వారా సాగునీరు చివరి ఆయకట్టు రైతులకు సరఫరా కాకుండా అడ్డుపడటమే కాకుండా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకునే విధంగా పోలీసుస్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎదురురెదురుగా రెండు బైకులు ఢీ

ఒకరు మృతి, మరో యువకుడికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలం వద్ద దెబ్బతిన్న బైక్

ధరూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనగా ఒకరు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రంలోని చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అల్వలపాడుకు చెందిన సీకే రాము శనివారం రాత్రి గద్వాల వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన తెలుగు రమేష్ గద్వాల వైపు నుంచి అల్వలపాడుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ ఇద్దరు ధరూరు సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు సమీపంలోకి రాగానే రోడ్డుపై ఏర్పడిన గుంతలను తప్పించబోయి రెండు బైకులు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరిని గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రమేష్(30) మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆస్పత్రి వద్ద ఇరు కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇదిలా ఉండగా సీకే రాముకు కుడి చేయి విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆటో, బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ సమీపంలో ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో శనివారం నూతనగంటి సంపత్(23) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంపత్ ఆటోలో గుండాల నుంచి కల్వకుర్తి మండలం యంగంపల్లి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కొట్రగేట్ సమీపంలో కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ఆటో అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో సంపత్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రవి మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విషపురుగు కాటేయడంతో బాలిక మృతి

ధరూరు: ఇంట్లో పరుపులు తీస్తుండగా అందులో ఉన్న విష పురుగు కాటేయడంతో బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దపాడులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన భగవంతు కుమార్తె శివనందిని(13) 7వ తరగతి చదువుతోంది. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంట్లో ఉన్న పరుపులను తీస్తుండగా.. ఓ విష పురుగు కాటేసింది. గమనించిన బాలిక విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వెంటనే గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ వెంకట్రాములు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఆంజనేయులు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుదాటుతున్న పాదాచారుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అల్లీపూర్ చెందిన కోడిగంటి ఆంజనేయులు(52) కొన్ని రోజులుగా పట్టణంలోని సింధూ హోటల్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి పట్టణంలో పోస్టాఫీస్ వద్ద ప్రధాన రోడ్డు దాటుతుంటే ఆర్టీసీ బస్సు బస్టాండ్ నుంచి వనపర్తి వెళ్తున్న క్రమంలో అతనిని ఢీకొట్టడంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు రమేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లో మరొకరు

పెద్దకొత్తపల్లి: మండలానికి చెందిన గోగినేని శ్రీనివాస్‌రెడ్డి 14వ తేదీన హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో మృతి చెందగా పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచారు. సంబంధికులు ఎవరైనా ఉంటే ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ ఫోన్ నంబర్ 8712662419, రాచకొండ కమిషనరేట్ ఫోన్ నంబర్ 871266832371 సంప్రదించాలని పెద్దకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి నాగేషు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ అఖిల రియల్ ఎస్టేట్స్ వారి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అలంపూర్ చౌరస్తా, ఎంఆర్ఓ క్యాంప్ ఆఫీస్‌కు అతి చేరువలో ఆర్.కె.నగర్-2 వెంచర్‌లో అతి తక్కువ ధరకే ప్లాట్లు కలవు. మరియు కర్నూలు పుల్లూరు టోల్ ప్లాజా ఆనుకొని KUDA అప్రూవల్ గల లైఫ్ టౌన్ షిప్ వెంచర్ నందు ప్లాట్లు కలవు. సెంటు 5 లక్షలు మాత్రమే. సం.ప్ర: 78933 77713, 90003 72379.

EDUCATION
■ మీరు లాయర్, ఇంజినీర్, ప్రొఫెసర్, అగ్రికల్చర్ ఆఫీసర్ కావాలనుకుంటున్నారా! LL.B, B.Tech, M.Tech, B.Sc, M.Sc Agri MBA, Ph.D (All) Cont: 7013038197, (కొన్ని సీట్లు మాత్రమే).

SERVICES
■ మీరు కోర్టు కేసులతో బాధపడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మేము మీకు న్యాయ సలహాలు ఇస్తాము. GLS. L.B.Nagar, Hyd.7893011777

BUSINESS OFFER
■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222.

DOCUMENT MISSING
■ కె.వీరేష్ తండ్రి కె.శరణప్ప, వ:28 సం॥లు వృత్తి:ప్రైవేట్ ఎంప్లాయ్, R/o ఇ.నం.4-21, దామరగిద్ద గ్రా॥ & మం॥, నారాయణపేట జిల్లా-509407 అను నా యొక్క మెమోలు 1.H.T.No.1241112885, SSC-మే 2012, 2.H.T.No.1417229306, Inter-మార్చి 2014, 3.H.T.No.15176010, Degree (B.Sc)-సెప్టెంబర్ & అక్టోబర్ 2020 ఈ యొక్క మెమోలు తప్పిపోయినవి.కావున దొరికిన వారు సం॥ప్ర॥ 7989988053.
■ కందాటి శిరీష తండ్రి కె.ఉమాపతి, వ:28 సం॥లు వృత్తి:ప్రైవేట్ ఎంప్లాయ్, R/o ఇ.నం. 1-7-188/28/డి, హనుమాన్‌నగర్, న్యూగంజ్, మహబూబ్‌నగర్ టౌన్ & జిల్లా-509001 అను నా యొక్క మెమోలు 1.H.T.No.1341102546, SSC-మే 2013, 2.H.T.No.1517214527, Inter-జూన్ 2015, 3.H.T.No.15176011, Degree (B.Sc)-సెప్టెంబర్ & అక్టోబర్ 2020 ఈ యొక్క మెమోలు తప్పిపోయినవి. కావున దొరికిన వారు సం॥ప్ర॥ 7989988053.

HEALTH CARE
ORTHOPEDIC SURGEON
■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98666

GENERAL & LAPROSCOPIC SURGEON
■ కార్తీక్ హాస్పిటల్, పుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి, షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్. డా॥పార్వతీదేవి, M.D.,DGO, స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్:10-6PM, 08518-226162

WANTED
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సం॥ప్ర॥ 9391912949, 040-40123376.
■ మ.నగర్‌లో ఫైనాన్స్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్త్రీ, పురుషులు మరియు స్టూడెంట్స్ కావలెను. జీతం:20,000/- నుండి 55,000/- వరకు+ఇన్సెంటివ్ సెల్ : 9642725208.
■ Milk Packing Operator Sids Farm Attractive Salary Package @ Shabad, TS. Ph: 8309080683 / 9346621357, Email: hr@sidsfarm.com
■ Req. ITI Fitters/ Dip. Mech/ECE candidates for Electronic Industry, Hardware Park, Hyderabad. Ph:9625064269/ 8341181182.
■ Wanted Paediatrician, ENT Surgeon, Hospital Administrator, Marketing Manager For Multi Speciality Hospital - Ongole. Whatsapp C.V ✆ 98495 95190
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీతం: 18k. ఫోన్: 9160900024 / 9640400073.
■ Required Diploma or ITI Freshers / Experienced People to Work in Shadnagar. Contact: 8309080693 / 9346621357
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సాప్ చేయగలరు. 90596 63584, 95026 15217.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్